క్లుప్తంగా

విద్యార్థులకు మెరుగైన బోధన

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ దోహదపడాలని విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి సూచించారు. శనివారం మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పీఎంసీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు డిజిటల్ బోధనలో భాగంగా నవోదయ సమితి నుంచి 11, 12వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్స్ ఇచ్చినట్లు చెప్పారు. విజ్ఞాన్ జ్యోతి కార్యక్రమంలో భాగంగా నీట్, జేఈఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్యాబ్స్ ద్వారా విద్యార్థులు దక్షణ/జేఈఈ/ నీట్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ కావటానికి మెటీరియల్ పొందుపరిచినట్లు వివరించారు. విద్యార్థుల నైపుణ్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన సాగించాలని సూచించారు. ఈ సంవత్సరం విద్యాలయ హైదరాబాద్ రీజియన్‌లో బోర్డ్స్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా బోధన ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో దళిత వ్యక్తికి చెందిన భూమిని కబ్జా చేసిన గొల్ల హనుమంతుపై చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమరేష్, తాలుకా ప్రధాన కార్యదర్శి సుమాల చార్లెస్ కోరారు. శనివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హరిజన చిన్న హనుమంతు భూమిని కబ్జా చేసిన గొల్ల హనుమంతుపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 139 లో 0.79 ఎకరం భూమి హరిజన హనుమంతు పేరిట ఉందని తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన గొల్ల హనుమంతు దళితుడిని నమ్మించి నీకు పంట నష్ట పరిహారం తెప్పిస్తానని చెప్పి పాస్‌బుక్ తీసుకొని ఎమ్మిగనూరుకు చెందిన వ్యక్తికి విక్రయించినట్లు చెప్పారు. మద్యం తాగించి దళితుడితో రిజిస్ట్రార్ కార్యాలయంలో సంతకం పెట్టించుకున్నారని తెలిపారు. మోసం చేసి దళితుడి భూమిని విక్రయించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా సాదాకలి ఉరుసు


నెరణికి గ్రామ వీధుల్లో గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి గ్రామంలో వెలసిన సాదాకలి తాత ఉరుసులో భాగంగా శనివారం తెల్లవారుజామున గంధం, ఆ తర్వాత ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తాత సమాధిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున గంధం పురవీధుల గుండా ఊరేగింపుగా దర్గాకు చేరడంతో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేశారు. బుధవారం జియారత్ కార్యక్రమంతో సాదాకలి ఉరుసు వేడుకలు ముగుస్తాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


హనుమంతు (ఫైల్)

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతు (55) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం హనుమంతు గుండెలో నొప్పి ఉందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక హనుమంతు మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. హనుమంతు మృతి పట్ల శంకరబండ సర్పంచ్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, నాయకులు సుంకర రామాంజినేయులు, పురుషోత్తమరెడ్డి, తదితరులు సంతాపం తెలిపారు.

సారా, అక్రమ మద్యంపై నిఘా

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన మాళ మల్లేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా నాటుసారా, అక్రమ మద్యం కట్టడి చేసేందుకు పటిష్ట నిఘా ఉంచినట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్ తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న గట్టు ఉత్సవాల్లో నాటుసారాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు సివిల్, సెబ్ పోలీసులతో ఉమ్మడిగా దాడులు నిర్వహిస్తామన్నారు. సరిహద్దు ప్రాంతంలో 6 చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. అలాగే విజయవాడ నుంచి 20 మంది మొబైల్ టీంను నియమించినట్లు చెప్పారు. సారా, అక్రమ మద్యం, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై 94409 02577 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారించాలని కోరారు.

మునగ సాగుకు ప్రోత్సాహం

- ఎకరానికి 448 మొక్కలు అందిస్తున్న ప్రభుత్వం
- జాబ్‌కార్డు కలిగిన రైతులందరూ అర్హులు
- మొక్కల పెంపకానికి రెండేళ్లలో రూ.లక్ష నగదు
- ఆలూరు నర్సరీ నుంచి 25 వేల మొక్కల పంపిణీ
- అందుబాటులో 5 వేల మొక్కలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



మునగ చెట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన (ఫైల్), ఆలూరు నర్సరీలో ఉపాధి అధికారులతో కలిసి మునగ మొక్కలు పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి (ఫైల్)

ఆలూరు రూరల్: మునగకాయల పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నర్సరీలో మునగ మొక్కలు పెంచి రైతులకు ఉచితంగా అందిస్తోంది. ఇందుకోసం ఈ ఏడాది ఆలూరు క్లస్టర్ పరిధిలోని నర్సరీలో 30 వేల మొక్కలను సిద్ధం చేసి ఇందులో 25 వేల మొక్కలు పంపిణీ చేశారు. ఈ మొక్కలను ఇప్పటివరకు కర్నూలు జిల్లాలోని పత్తికొండ, ఆలూరు, దేవనకొండ, తుగ్గలి, చిప్పగిరి, హొళగుంద, ఆస్పరి తదితర మండలాలకు ఇక్కడి నుంచే సరఫరా చేసినట్లు ఎన్ఆర్ ఈజీఎస్ అధికారులు వెల్లడించారు. చనిపోయిన మొక్కల స్థానంలో మరో మొక్క నాటేందుకు రైతుల కోసం 5 వేల మొక్కలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెబుతున్నారు. నియోజవకర్గంలోని చిన్న సన్నకారు రైతులకు అవగాహన కల్పించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడీలు, ఏపీఓలు, టీఏలు, మేటీలు కృషి చేస్తున్నారు.

రుణాలతో పాటు వంద రోజుల పనిదినాలు

ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు. యూనిట్ మంజూరైన రైతులకు పనిదినాలు, మెటీరియల్‌కు సంబంధించిన బిల్లులు, పనిని బట్టి దశల వారీగా అందించడం జరుగుతుంది. మొక్కలకు గోతులు తీయడం, రవాణా ఖర్చు, మొక్కలు నాటడం, గోతిలో ఎరువులు వేయడం ప్రతి నెలా నీటి సౌకర్యం, మొక్కల సంరక్షణ వంటి వాటన్నింటికీ కలిపి బిల్లు మంజూరు చేస్తారు. పావు ఎకరాకు 112 మొక్కలు, ఒక ఎకరాకు 448 మొక్కలు నాటుకోవచ్చు. 25 సెంట్లకు 27,495, ఎకరాకు రూ.లక్ష రెండు సంవత్సరాలకు దశల వారీగా అందిస్తారు. మునగను సంప్రదాయ వైద్య వ్యవస్థలో ఉపయోగిస్తుండడం వల్ల దీనికి మంచి డిమాండ్ ఉంది. వ్యాధులను దూరం చేస్తుంది. రక్తహీనత, అధిక రక్తపోటు, బాలింతల్లో పాల ఉత్పత్తి పెంపు, కాలేయ సంబంధిత వ్యాధులను అరికట్టేందుకు, శృంగారానికి ఈ మునగ చాలా ఉపయోగ పడుతుందని వైద్యులు చెబుతున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకం కింద రైతులకు ప్రభుత్వం ఉచితంగా మునగ మొక్కలు అందిస్తుంది.ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.చిన్న, సన్నకారు రైతులకు మొక్కలతో పాటు వంద రోజుల పనిదినాలు కల్పిస్తాం. మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.50 వేలు అందిస్తాం. పావు ఎకరం నుంచి ఎకరా పొలం ఉన్న రైతులకు మొక్కలు అందిస్తాం. దీంతో ఆర్థిక ప్రగతి సాధించేందుకు అవకాశం ఉంటుంది.

– అల్లబక్ష్, ఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం ఆఫీసర్,

'బన్ని' ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం నెరణికి తండా గ్రామంలో ఉత్సవాల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24న జరిగే బన్ని ఉత్సవాలకు రింగు కర్రలు తీసుకెళ్లడం, మద్యం సేవించి ఉత్సవంలో గుంపులుగా పాల్గొనడం మంచి సాంప్రదాయం కాదన్నారు. విగ్రహాల ఊరేగింపులో అగ్గి కాగడాలను భక్తులపై విసరడం, అల్లర్లకు దిగడం లాంటి పనులు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సంప్రదాయ పద్ధతిలో భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలన్నారు. అలాగే నాటుసారా, మద్యం అమ్మకాలపై పూర్తి నిఘా పెట్టామని, అల్లర్లకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

రైతు భరోసా దరఖాస్తుకు నేడే ఆఖరు

హాలహర్వి: వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం కోసం కొత్తగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీతో గడువు ముగుస్తుందని ఏఓ శివశంకర్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇంకా దరఖాస్తు చేసుకోని వారు స్థానిక రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ


పత్తికొండలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం స్థానిక నివాస గృహంలో పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాలకు చెందిన వారికి, పందికోన టీడీపీ కార్యకర్త ఈడిగ రాఘవేంద్రకు రూ.40 వేలు, కొత్తకోట మహబున్నికి రూ.42 వేలు, బనగాని అంజినయ్యకు రూ.90 వేలు, సయ్యద్‌హుసేన్‌కు రూ.50 వేలు, గోసి రమేష్‌కు రూ.1.50 వేలు, కురువ లక్ష్మినారాయణకు రూ.28 వేలు, వెంకటలక్ష్మికి రూ.18 వేలు మొత్తం రూ.4.50 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి అందించినందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే శ్రీదేవికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్య శ్రీ పరిధిలో లేని వైద్య చికిత్సల కోసం సీఎం సహాయనిధి ద్వారా సాయం పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, బనగాని శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు


కొత్తపేట కొండల్లో సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట, అరికెర కొండల్లో శనివారం ఆలూరు సివిల్, సెబ్ సీఐలు వెంకటేశ్వర్లు, ఎర్ర వెంకట్ ఆధ్వర్యంలో హొళగుంద, ఆలూరు, ఆస్పరి ఎస్ఐలు శ్రీనివాసులుతో పాటు సిబ్బంది నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. కొండల్లో ఉన్న నాటుసారా స్థావరాలను గుర్తించి అక్కడ సారా తయారు చేసేందుకు బిందెల్లో నిల్వ ఉంచిన 450 లీటర్ల బెల్లం ఊటను, బిందెలను ధ్వంసం చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 15 లీటర్ల నాటుసారా, 256 కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 24న దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాన్ని పురస్కరించుకుని కొండల్లో పెద్ద ఎత్తున సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం నుంచి కొండల్లో గాలించి స్థావరాలను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు, జైలు శిక్ష తప్పదని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు.

జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక


అనూష

మద్దికెర: మండల పరిధిలోని మదనంతపురం గ్రామానికి చెందిన తిమ్మప్ప, లక్ష్మి దంపతుల కుమార్తె అనూష అనే విద్యార్థిని జాతీయ చాంపియన్‌షిప్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తల్లిదండ్రులు శనివారం తెలిపారు. అనంతపురంలోని శ్రీ సాయివిద్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ ఆటల్లో రాణిస్తోందన్నారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం, జైపూర్‌లో జరిగిన పోటీలలో ప్రతిభ కనబరిచి జూనియర్ జాతీయ చాంపియన్‌పోటీలకు ఎంపికైందని, ఈనెల 19వ తేదీ గోవాలో నిర్వహించే పోటీలలో పాల్గొంటుందని వారు తెలిపారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం


పూజలందుకుంటున్న ఈరన్న స్వామి మూలవిరాట్


స్వామివారి దర్శనం కోసం క్యూలో వస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడిగా నెలకొంది. శనివారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. రెండవ శనివారం సెలవు రోజుతో పాటు అమావాస్య కలిసి రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో పోటెత్తాయి. స్వామి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకు పూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులను విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ మార్గాల ద్వారా దర్శనానికి పంపారు. పిండి వంటలు వండి స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఏర్పాట్లును పర్యవేక్షించారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- అలాగే ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అమావాస్య కావడంతో భక్తుల సందడి నెలకొంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజినేయ స్వామిని దర్శనానికి కూడా తరలిరావడంతో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.
- తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో అధికంగా కర్ణాటక భక్తులు కూడా తరలి వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


రామతీర్థంలో వెలసిన గాయత్రీమాత

మద్దికెర: స్థానిక నగిరేశ్వర దేవాలయంలో విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. ప్రతిరోజు అమ్మవారికి ఉదయం 9 గంటలకు కుంకుమార్చన, రాత్రి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 15న రాజరాజేశ్వరి, 16న భవాని, 17న అన్నపూర్ణదేవి, 18న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, 19న గాయత్రీదేవి, 20న సరస్వతీ దేవి, 21న సంతానలక్ష్మి, 22న కనక దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు చెప్పారు. 23న విజయదశమి ఉత్సవాలతో పాటు మధ్యాహ్నం పల్లకీ ఉత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, జొహరాపురం, రామతీర్థంలో వెలసిన మారెమ్మవ్వ, పెద్దమ్మవ్వ, పార్వతీదేవి, కన్యకా పరమేశ్వరీమాత, గాయత్రీ మాత ఆలయాలలో ఆదివారం నుంచి శరన్నవ రాత్రి పూజలు నిర్వహించునున్నట్లు ఆలయ నిర్వాహకులు రూపామోహన్‌శర్మ, సతీష్ ఆచారి, మల్లికార్జునస్వామి, తెలిపారు. ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

వెల్దుర్తి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి శాలలో ఈనెల 15వ తేదీ ఆదివారం నుంచి 24వ తేదీ వరకు దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఆపద్ధర్మ అధ్యక్షుడు సముద్రాల శ్రీరాములు, ఆర్యవైశ్య సంఘం, దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఆలూరు: మండలంలోని హత్తిబెళగళ్ గ్రామ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు అండర్-17, 14 విభాగంలో రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల పీఈటీ చిన్నబాబు తెలిపారు. గత నెలలో జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు వరుణ్‌కుమార్, రియాజ్, మానస, శివకుమార్ తదితరులు సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు చెప్పారు. ఈ సందర్భంగా హెచ్ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామం హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని పి.రేవతి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. శనివారం కర్నూలులో జరిగిన అండర్-17 పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం అబ్దుల్ రహిమాన్ తెలిపారు. క్రీడాకారిణి రేవతి, కోచ్ పీడీ మధుసూదన్‌ను గ్రామస్తులు అభినందించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

దేవనకొండ : కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు డిమాండ్ చేశారు. ఈనెల 16వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ శనివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని, పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.30 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సీపీఐ మండల నాయకులు భాస్కర్, రవి, వెంకటేష్, తిక్కయ్య, రామస్వామి, రామాంజనేయులు, సురేంద్ర, సుల్తాన్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆర్బీకే నిర్మాణం


నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం

మద్దికెర: రైతులకు సత్వర సేవలు అందించేందుకు చేపట్టిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్ర నిర్మాణం మండల కేంద్రమైన మద్దికెరలో శరవేగంగా జరుగుతోంది. రూ.20 లక్షలతో చేపట్టిన భవన నిర్మాణం త్వరలో పూర్తి చేసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి,ఎంపీపీ అనిత వెల్లడించారు.

కోలుకోలేక వివాహిత మృతి

ఆదోనిఅర్బన్:మండలంలోని చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన శివలింగమ్మ (27) కుటుంబ కలహాలతో శుక్రవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విధితమే. శివలింగమ్మ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందింది. మృతురాలికి భర్త వీరేష్, ఒక కుమార్తె సంతానం. గత ఆరు సంవత్సరాల క్రితం వివాహమయ్యింది. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఎలుకల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపిన వివరాల మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


పూజలందుకుంటున్న దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి


ఎల్లార్తిలో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

హొళగుంద: మండలంలో శనివారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అందులో భాగంగా దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి, హొళగుంద శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. హొళగుందలోని సాయిబాబా మందిరం భక్తులతో కిటకిటలాడింది. అదేవిదంగా ఎల్లార్తి షేక్షావలి, షాషావలి, హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. స్థానికులే గాకుంగా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు తరలి వచ్చి ఆలయాలు, దర్గాలను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పత్తికొండ రూరల్: పత్తికొండ-కర్నూలు రోడ్డులో కొలువైన అభయాంజనేయ స్వామికి శనివారం వైభవంగా అమావాస్య పూజలు నిర్వహించారు. అర్చకుడు రవి స్వామివారికి జలాభిషేకం, సహస్త్రనామార్చన, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. మద్దికెర ఏపీఎం మధుబాబు జన్మదినం సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. భక్తాదులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అద్దె భవనాలతో అవస్థలు


గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం

గోనెగండ్ల: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చాలీచాలనీ గదులతో పాటు కనీస సౌకర్యాలు లేక అధికారులు, సిబ్బంది అవస్థలు పడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మండలంలో ఇరిగేషన్ భవనాలలో విధులు నిర్వహిస్తున్నారు. సొంత భవనాలు మాత్రం నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, వెలుగు కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటన్నింటికీ ప్రతినెలా వేలాది రూపాయల ప్రజాధనం వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనాలకు అద్దె చెల్లించడం లేదు. వీటిలో కొన్ని శిథిల భవనాలు కావడంతో వర్షం వస్తే ఈ కార్యాలయాల్లో ఉండలేని పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. ఇలా ఏళ్ల తరబడి ఇరిగేషన్ భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

శ్రీమఠంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనం

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశీస్సులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మూలబృందావనంకు నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం బెంగళూరు నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. దేశం నలుమూల నుంచి తరలివచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయలను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై ఊరేగించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా శ్రీమఠంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. క్రాంతి నగర్ కాలనీకి చెందిన గోపాల్, పంజరాపోల్ కాలనీకి చెందిన అంకిత్ ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలపై వస్తూ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం వైద్యులు ఇద్దరినీ కర్నూలుకు రెఫర్ చేశారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.